సిగరెట్ వెలిగించుకున్నాడతను.

సురేష్ గుండె వేగంగా కొట్టుకోసాగింది. 'ఏమిటా అవకాశం?'

"నీ అద్భుతమయిన టాలెంట్స్ చూశాక నాకనిపించింది - శాశ్వతంగా నువ్విక్కడే వుంటే బావుంటుందని! అవసరం కలిగినప్పుడల్లా నా స్థానంలోకి వచ్చి ఆఫీస్ వ్యవహారాలన్నీ చూసుకుంటూండాలి. నీ కోసం మా ఎస్టేట్ లోనే ఇల్లు, కారు, ఫోను అన్నీ ఉచితంగా ఏర్పాటు చేస్తాను. నీకేం కావాలన్నా సర్వస్వం ఇంట్లోనే దొరుకుతాయ్. నీకు నౌఖర్లు, వంటమనిషి వుంటారు. ఇందుకు వప్పుకుంటే సంవత్సరానికి లక్ష రూపాయల జీతం! నువ్వు ఒక్కడివే ఎక్కడికయినా వెళ్ళవచ్చు. టూర్లు చేయవచ్చు. కాని బయట ఎవరితోనూ కలవకూడదు. మాట్లాడకూడదు. నీతో ఎప్పుడూ ఒక గార్డ్ కూడా వుంటాడు".

సురేష్ ఆలోచనలో పడ్డాడు.

సంవత్సరానికి లక్ష రూపాయల జీతం - తనకు నమ్మబుద్ధి కావటం లేదు. ఇంత అదృష్టం వరిస్తోందంటే!

కారు, అదీగాక ఇల్లు, ఫోను, నౌఖర్లు.

ఎవరికి దొరుకుతుందింత అదృష్టం?

హఠాత్తుగా తులసి గుర్తుకొచ్చిందతనికి. అవును, తులసి సంగతేమిటి మరి? తనతోపాటూ తులసిని కూడా వుండనిస్తారా! ఉండనిస్తే తనకింకా అభ్యంతరం ఎందుకుండాలి?

"నా పర్సనల్ లైఫ్ గురించి మీకేమైనా షరతులున్నాయా?" అడిగాడు సురేష్ .

"ఎస్ సురేష్ ! తప్పకుండా వుంటాయ్. మాదగ్గర పనిచేసే ముఖ్య మైన సిబ్బంది అందరూ పూర్తిగా మా స్వాధీనంలో వుండాలి. వాళ్ళ సంసారాలు, బంధువులు, వాళ్ళ ఫ్రెండ్స్ - కొన్ని పరిధులకు లోబడి వుండాలి. నీ కెవరయినా గాళ్ ఫ్రెండ్ వుంటే ఆ అమ్మాయిని నీతో తెచ్చుకోవచ్చు! కానీ మళ్ళీ ఆ అమ్మాయి బయట ఎవరితోనూ మిక్స్ అయే అవకాశం వుండదు".

అంటే అప్పుడు తామిద్దరూ సంయుక్తంగా ఖైదీలవుతారన్నమాట. ఉహూ! తులసి ఎప్పటికీ వప్పుకోదీ ప్రపోజల్! కాని సంవత్సరానికి లక్ష.

"ఓ కే సురేష్ ! వెంటనే నిర్ణయం తీసుకోవటం నీకూ కష్టమే! ఏ సంగతీ రేపు ఉదయానికల్లా నాకు చెప్పాలి. ఈలోగా నీ కొత్త ఇల్లు, కారూ, అవన్నీ ఓసారి చూసుకో".

విష్ణు లోపలికొచ్చాడు "పద సురేష్ !"

సురేష్ విష్ణుతో బయటకు నడిచి రహస్య లిఫ్టు ద్వారా గేరేజ్ లోకి దిగి కారులో కూర్చున్నాడు.

కారు వేగంగా మాధురి ఇండస్ట్రీస్‌లో నుంచి పోతోంది. రెండు వైపులా పరిశ్రమ

భవనాలున్నాయి. అవి దాటాక మాధురి ఎస్టేట్ ప్రారంభమైంది.

లోపల గీజురుమనే తోటలు! చాలా పెద్ద చెట్లు
రకరకాలవి- వాటి మధ్య అందంగా కనబడుతున్న చిన్న చిన్న ప్లాట్సు. వాటన్నిటిని దాటుకుంటూ రెండు కిలోమీటర్లు ప్రయాణించింది కారు. ఎదురుగా చిన్న కొండ! దానిమీద ఉందో అందమయిన యిల్లు. ఇంటిముందు కారు. ఎర్ర రంగు సుజుకి! జపాన్ నుంచి ఇంపోర్టు అయుంటుంది.

కారు ఆపాడు విష్ణు.

"అదే నీ బంగ్లా సురేష్ ! అదృష్టమంటే నీదే"

బిల్డింగ్ దగ్గరకు చేరుకుని బెల్ నొక్కాడతను.

ఒక యువతి వచ్చి తలుపు తెరచింది. నల్లగా వుందామె. ఆమె పక్కనే ఓ ముసలతను.

"ఈమె పేరు విక్కీ! వంటమనిషి! ఆరు దేశాల వంటకాలు తయారు చేయగలదు. అతను నౌఖర్" లోపలకు నడుస్తూ అన్నాడు విష్ణు .

ఇల్లంతా చూశాడు సురేష్ . రెండు బెడ్‌రూమ్‌లు, ఒక డైనింగ్ రూమ్, ఒక డ్రాయింగ్ రూమ్, ఒక వంటగది. ఎటాచ్‌డ్ బాత్స్.

తన అందమైన కల యిది.

ఎన్ని కలలు కన్నాడు తనూ, తులసీ ఇలాంటి ఇంట్లో జీవితం గడపాలని. ఇప్పుడా కల నిజమవబోతోందా?

"ఆల్ రైట్ సురేష్ ! నేను వెళుతున్నాను. రేపు ఉదయం వస్తాను మళ్ళీ. నువ్వు అంతవరకూ స్వేచ్ఛగా సుఖంగా గడవచ్చు"

విష్ణు వెళ్ళిపోయాడు.

గదిలో కలర్ టెలివిజన్, విసి ఆర్, ఫ్రిజ్, అల్మారాల నిండా విడియో క్యాసెట్లు రకరకాల మాగజైన్స్, పుస్తకాలు.

బయటికొచ్చి పోర్టికోలో నిలబడ్డ సరికొత్త కారు మీద చేయి వేసి ఆనందంగా నిమిరాడతను......ఈ కారు కూడా తనదే......తను తల్చుకుంటే.

ఫోను మోగింది. ఒక్క ఉదుటున లోపలకు నడిచి ఫోను అందుకున్నాడు.

"హలో......."

మాధురి కంఠం మెత్తగా మత్తుగా వినబడుతోంది .

"ఎలా వుందక్కడ సురేష్ ?"

"చాలా ప్లెజెంట్‌గా వుంది"

"ఈ ప్లెజెంట్‌నెస్ ని శాశ్వతం చేసుకునే అవకాశం నీ చేతుల్లో వుంది సురేష్....."

"ఆ .....అవునవును"

"నీ కిప్పుడు పూర్తి స్వేచ్ఛ వుంటుంది. మన ఎస్టేట్‌లో ఇండస్ట్రీస్‌లో ఎక్కడయినా తిరిగవచ్చు. సిటీకి కూడా వెళ్ళవచ్చు. కానీ ఒకే ఒక్క షరతు. ఎవరినీ కలుసుకోకూడదు. కొద్ది రోజులపాటు నీ కదిలిక లన్నీ మావాళ్ళు గమనిస్తూంటారు. అన్ని విధాలా సంతృప్తి కలిగితే, నీ భవిష్యత్తు ఉజ్వలంగా వుంటుంది".

"అలాగే......"

ఫోన్ డిస్కనెక్ట్ అయింది.

విక్కీ ట్రేలో 'టీ' తీసుకొచ్చి అతని ముందుంచింది.

"ఈజిప్షియన్ టీ సార్. చాలా మంది విదేశీయులు బాగా లైక్ చేసేది" నవ్వుతూ చెప్పిందామె. అప్పుడు గమనించాడు సురేష్ . విపరీతమైన సెక్స్ వుందామె శరీరపు వంపుల్లో. పుష్కలంగా కిక్కిరిసి పోయిన సెక్స్! ఆమె నవ్వుతూంటే మరింత ముందుకు పొంగుతున్నట్లుంది.

ఎంత సెక్స్! గొంతు తడారిపోతోంది,

37-26-30 వుంటుందా? ఏమో ఈ విషయంలో తన లెక్కలు తప్పేట్లున్నాయ్.

కప్పు తీసుకుని ఆమెవంకే చూస్తూ టీ తాగసాగాడతను.

"చాలా అద్భుతంగా వుంది టేస్ట్" అన్నాడు మధ్యలో .

"థాంక్స్ సర్!" సంతృప్తి గా అందామె.

అతను తనవంకే చూడటం గమనించి ప్రోత్సాహకరంగా నవ్విందామె.

"ఏం కావాలన్నా చెప్పండి సర్! ఏదయినా సరే"

ట్రే తీసుకెళ్ళిపోతూ అంది.

అతని శరీరం వేడెక్కిపోయింది. ఆ మాటల్లో అంతరార్థం ఏమిటి? ఏదయినా అంటే అన్నీనా?

"ప్రస్తుతానికి ఏమీ వద్దు"

ఆమె వెళ్ళిపోయింది. సెక్స్ నింపుకుని పడుతున్న అడుగులవంకే చూస్తూండిపోయాడు. మంచం మీద పడుకుని అల్మారలోంచి నవల తీశాడు. కొద్ది పేజీలు చదివాక తెలిసింది. తన మనసు పుస్తకం మీద లగ్నం కావటం లేదు. ఇక్కడ ఎంత అద్భుతమయిన జీవితం అనుభవించవచ్చు.

తనేం నిర్ణయం తీసుకోవాలో తెలీటం లేదు. తులసి ఇందుకు వప్పుకోదనే అనిపిస్తుంది ఎప్పుడు నిద్రపట్టిందో తెలీదు. విక్కీ నిద్ర లేపుతూంటే మెలకువ వచ్చింది తన మీదకు వంగి కవ్విస్తూన్న నవ్వుతో జారిపోతున్న పైటతో.

"భోజనం వడ్డించమంటారా సార్? టైము ఎనిమిదవుతోంది"

అతను లేచి కూర్చున్నాడు . సాయంత్రాలు సాధారణంగా తను నిద్రపోడు. ఇప్పుడెలా నిద్రపోయాడో తెలీదు.

నౌకర్ భోజనానికి అన్నీ అమర్చాడు. విక్కీ వడ్డిస్తోంది. అన్నీ తనంతవరకూ రుచి చూడని కొత్త వంటకాలు. "వంటకాలు చాలా బాగా కుదురుతాయి నాకు. పార్టనర్స్ అడిగి మరీ వండించుకునే వాళ్ళు."

భోజనం ముగించి బయట గార్డెన్‌లో కొద్దిసేపు పచార్లు చేశాడతను.

తన కోసం ఏర్పాటు చేయబడ్డ కారు వంక చూస్తుంటే చెప్పలేని ఆనందం.

రేపే డ్రయివింగ్ నేర్చుకోవటం ప్రారంభించాలి. అర్జున్‌తో చెప్తే నేర్పేందుకు ఎవరోకర్ని ఏర్పాటు చేస్తాడు. ఎప్పుడో చదువుకునే రోజుల్లో తన ఫ్రెండ్ డార్క్‌డెవిల్ కారు నడపడం నేర్చుకున్నాడు గానీ అప్పుడే మరిచిపోయాడు మళ్ళీ.

"కారు డ్రైవింగ్ వచ్చా సర్?" గడపలో నిలబడి అడిగింది విక్కీ .

"రాదు......."

"మీరు కావాలంటే నేను నేర్పగలను సార్! నాకు బాగా డ్రయివింగ్ వచ్చు. మాధురిగారికి నేనే నేర్పించాను" బయటికొచ్చి వెన్నెల్లో నిలబడుతూ అందామె.

అతనికి ఏం మాట్లాడాలో తెలీటం లేదు. వెన్నెల్లో ఆమె శరీరపు వంపులు మరింత పిచ్చెక్కిస్తున్నాయ్.

"అయితే ........ఇప్పుడు .....కాసేపు నేర్పుతావా?" అడిగాడు సందేహంగా.

"ఓ! తప్పకుండా సార్! రండి !" కారు డోరు తెరచుకుని డ్రైవింగ్ సీట్లో కూర్చుందామె ఆమె పక్కనే కూర్చున్నాడు.

"ముందు స్టీరింగ్ కంట్రోల్ చేయటం నేర్చుకోవాలి సర్! ఏ డ్రయివింగ్ కయినా స్టీరింగ్ కంట్రోల్ ముఖ్యం సార్! చాలా మందిఇది తెలీకే దెబ్బతింటూంటారు. నేను కారు నెమ్మదిగా నడుపుతుంటాను. మీరు స్టీరింగ్ కంట్రోల్ చేయండి. రోడ్‌కి సరిగ్గా సెంటర్లో కారు నడపాలి. అంతే మీరు చేయవలసింది".

"సరే" స్టీరింగ్ మీద చేయి వేశాడతను.

"ఇంకొంచెం దగ్గరకు రండి సర్, స్టీరింగ్‌కి వీలయినంత సెంటర్లో ఉండండి " ఆమె ఓ పక్కకి జరుగుతూ అంది.

సురేష్ ఆమెకు సమీపంగా జరిగాడు. ఆమె శరీరం నుంచి సెగలు తన శరీరంలోకి జొరబడుతున్నాయి.